
రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6:24 మంగళవారం

సహర్ 4:57 బుధవారం



అడుగంటిన భూగర్భ జలాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

వేసవి ప్రారంభంలోనే ఎండలు మండుతున్నాయి. దీంతో రోజురోజుకు భూగర్భజలాలు అడుగంటి పంటపొలాలు ఎండుతున్నాయి. జనవరిలో 4.89 మీటర్లలో నీరు ఉండగా నెలరోజుల వ్యవధిలోనే ఎనిమిది మీటర్ల లోతుకు వెళ్లాయి. దీంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. శ్రీరాంసాగర్ ఆయకట్టుకు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో నీరు వదులుతున్నారు. ఆయకట్టేతర మెట్ట భూములకు చెరువులు, బావులే ఆధారం. చెరువుల్లో నీరు లేక బావుల్లో నీరు అడుగంటి మెట్టప్రాంతాల్లో పంటలు ఎండుతున్నాయి. గంగాధర, రామడుగు, చొప్పదండి, కరీంనగర్ రూరల్, చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లో ఈ పరిస్థితి కనిపిస్తున్నది. గతంలో ఎల్లంపల్లి ద్వారా గంగాధర, రామడుగు, చొప్పదండి, కరీంనగర్ రూరల్ మండలాల చెరువులు నింపేవారు. దీంతో వరద కాలువల్లో కూడా నీరు నిలువ ఉండేది. ప్రస్తుతం వరద కాలువల్లో చుక్క నీరు లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతినడంతో నీరు నింపే పరిస్థితి లేదు. దీంతో చెరువుల్లో నీరు లేకుండా పోయింది.

● ప్రాజెక్టుల్లో తగ్గుతున్న నీటిమట్టం

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 90 టీఎంసీలకు గాను 25.63 టీఎంసీల నీరు ఉన్నది. మిడ్‌మానేరులో 27.5 టీఎంసీలకు గాను 12.30 టీఎంసీ, లోయర్ మానేరు డ్యాంలో 24.03 టీఎంసీలకుగాను 7.41 టీఎంసీల నీరు మాత్రమే నిలువ ఉన్నది. మిడ్‌మానేర్, లోయర్ మానేరు రిజర్వాయర్లతోపాటు చెరువులు, కుంటలు, వరద కాలువల్లో నీటి నిలువలు తగ్గిపోయాయి. దీంతో బావులు, బోరుబావుల్లోకూడా నీరు అడుగంటి పోతున్నాయి. బోర్లు, బావుల నుంచి నీరు రావడం లేదు. జిల్లాలో అత్యధికంగా గంగాధర మండలంలో 23.15 మీటర్లలోతుకు నీటి మట్టం పడిపోయింది. జిల్లాలో ఈ యాసంగిలో 2.5 లక్షల ఎకరాల్లో వరి, 25వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. ఈ పంటలకు ఆయకట్టు పరిధిలో ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో నీరు విడుదల చేస్తున్నారు. వరి పొలాలు పొట్ట దశలో ఉండగా సరైన నీరు అందక పోతే పంటలు ఎండిపోతాయని, కనీసం నెలరోజులపాటు నీరు ఉంటే తప్ప పంట చేతికిరాదని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మార్చి 31 వరకు మాత్రమే సాగినీటిని విడుదల చేస్తామని, జలాశయాల్లో నీటినిల్వలు తగ్గడంతో ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని నీటిపారుదలశాఖ అధికారులు తేల్చిచెప్పడంతో పంటలు ఎండిపోతాయని ఆందోళనకు గురవుతున్నారు. కనీసం ఏప్రిల్ 15వ తేదీ వరకైనా నీటిని విడుదల చేసి పంట పొలాలను ఎండిపోకుండా కాపాడాలని రైతులు కోరుతున్నారు.



రామడుగు మండలంలో వాగులో రైతులు తవ్విన బావి



రామడుగు మండలంలో వాగు నుంచి పైపులైన్ వేస్తున్న రైతు

- నెలరోజుల్లో ఎనిమిది మీటర్లకు పడిపోయిన నీటి మట్టం
- నెర్రెలు బారుతున్న వ్యవసాయ భూములు
- మైదానాలుగా మారుతున్న చెరువులు, కుంటలు
- ఆందోళనలో అన్నదాతలు

హుజూరాబాద్ మండలంలోని మెట్టప్రాంతాల్లో భూగర్భజలాలు అడుగంటి పోవడంతో మొక్కజొన్న, వరి సాగు చేసిన రైతులు పంటలను కాపాడుకునేందుకు వ్యవసాయబావుల్లో పూడిక తీత, బోరుబావులను తవ్వడం వంటి వాటితో ఇబ్బందులు పడుతున్నారు. సైదాపూర్ మండలంలో భూగర్భజలాలు తగ్గిపోవడంతో బోరుబావులు, వ్యవసాయ బావుల్లో నీరు లేక ఎండిపోవడంతో వరి, మొక్కజొన్న కళ్ల ముందే ఎండిపోతున్నాయని, పొలాలు నెర్రలు బారుతున్నాయని ఆందోళనచెందుతున్నారు. వీణవంక మండలంలో ఎనిమిది గంటలు ఏకబిగిగా నీరు అందించే బావుల్లో ప్రస్తుతం మూడు గంటలు కూడా నీరు రావడం లేదని రైతులు వాపోతున్నారు. రామడుగు, గంగాధర, చొప్పదండి, కరీంనగర్ రూరల్ మండలాల్లో కూడా పంట పొలాలకు సరిపడా నీరు రావడం లేదు. దీంతో కొంత మంది రైతులు వారి పంట పొలాలను కాపాడుకునేందుకు ట్యాంకర్లతో నీటిని తెచ్చి పంట పొలాలకు పోస్తున్నారు. జిల్లాలోని ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలోని చివరి భూములకు నీరందక పంటలు ఎండి పోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పొట్టదశలో ఉన్న వరి పొలాలను కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోనెలరోజుల పాటు ఇదే తరహాలో ఎండలు తీవ్రంగా ఉంటే పంటలు పూర్తిగా ఎండిపోయి పెట్టుబడి కూడా రాదని తీవ్రంగా నష్టపోక తప్పదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.



వరదకాలువలో తగ్గిన నీరు


నేటి నుంచి పవిత్ర రంజాన్ మాసం

● కనిపించిన నెలవంక

కరీంనగర్ కల్చరల్, మార్చి 11: ముస్లింల పవిత్ర రంజాన్ మాసం మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. సోమవారం రాత్రి నెలవంక దర్శనమిచ్చింది. దీంతో ఉపవాస దీక్షలు (రోజా) చేపట్టేందుకు ముస్లింలు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ మాసంలోనే పవిత్ర గ్రంథమైన ఖురాన్ ఆవిర్భవించింది.

●రోజా ప్రాముఖ్యం..

కోరికలను జయించడం, ఇంద్రియ నిగ్రహంతో హృదయాన్ని పరిశుద్ధంగా ఉంచుకోవడం రోజాలో భాగం. ఖురాన్ ఉపవాసాన్ని సహనంగా పేర్కొంది. సహరీ సమయంలో సూర్యోదయానికి ముందు భోజన పానీయాలను ముగించాలి. సూర్యాస్తమయం తర్వాత ఉపవాసం విరమించి ఇఫ్తార్ సమయంలో ఆహారాన్ని తీసుకుంటారు. ఐదు పూటల నమాజ్, ఇషా వేళలో ఫర్జ్ తర్వాత అదనంగా 20 రకాల తరావీ నమాజ్ కూడా చేయాలి. రంజాన్ మాసంలో ముస్లింలు విధిగా దాన ధర్మాలు చేయాలి.



●ముస్తాబైన హరీస్ స్టాళ్లు

రంజాన్ మాసం సందర్భంగా జిల్లా కేంద్రంలో హరీస్ స్టాళ్లు ముస్తాబయ్యాయి. నగరంలో సుమారు 15 నుంచి 18 వరకు హరీస్ స్టాళ్లు వెలిశాయి. మరో వైపు ఉపవాసానికి ముందు, తర్వాత తినేందుకు బాదాం, పిస్తా, ఖర్జూరా, సేమియా, వివిధ రకాల పండ్ల అమ్మకాల కోసం కూడా ప్రత్యేక సెంటర్లు వెలిశాయి. ప్యాకేజీల రూపంలో పలు మాంసాహార పదార్థాలను, హరీస్, హలీమ్‌లను అందించనున్నారు.

'కదనభేరి'కి భారీగా ఏర్పాట్లు

● లక్ష మంది జనసమీకరణపై దృష్టి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కరీంనగర్‌లో బీఆర్ఎస్ పార్టీ కదనభేరి సభతో పార్లమెంట్ ఎన్నికలకు సమరశంఖం పూరించనున్నది. మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో నిర్వహించే భారీ బహిరంగ సభలో లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడతారు. ఈ సభను విజయవంతంచేసేందుకు పార్టీశ్రేణులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లాలో ఐదు స్థానాలకే పరిమితమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయాన్ని చవిచూసిన బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా పూర్వవైభవాన్ని సంతరించుకోవాలని చూస్తున్నది. ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకోవడం ద్వారా పైచేయి సాధించా లని ఆ పార్టీ నాయకులు, శ్రేణులు భావి స్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల ప్రచా రానికి కేసీఆర్ కరీంనగర్ నుంచే శ్రీకా రం చుట్టాలని నిర్ణయించడంతో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు కరీంనగర్‌లో జరుగనున్న కరీంనగర్ కదనభేరి సభకు పెద్ద ఎత్తున ప్రజలను తరలించి మళ్లీ సింహగర్జన సభ నాటి రోజులను పునరావృతం చేయాలని భావిస్తున్నారు.



వేదికపై నుంచి సభా స్థలి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

● రెండు స్థానాల్లో విజయం సాధించాలని..

కరీంనగర్ అభ్యర్థిగా బోయినపల్లి వినోద్‌కుమార్‌ను, పెద్దపల్లి అభ్యర్థిగా కొప్పుల ఈశ్వర్‌ను ప్రకటించారు. కదన భేరి సభలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి లక్షకు తగ్గకుండా ప్రజలను సమావేశానికి హాజరయ్యేలా చూడాలని లక్ష్యంగా పెట్టుకొని అందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కరీంనగర్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్, శాసనసభ్యుడు, మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఎస్సారార్ కళాశాల మైదానంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో తమకు ముక్కోణపు పోటీ జరుగనున్న నేపథ్యంలో కష్టపడితే విజయం సాధించవచ్చని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

● గులాబీ మయంగా కరీంనగర్

జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాల మైదానంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ నిర్వహించనున్న కరీంనగర్ కదనభేరి సభకు పార్టీశ్రేణులు విస్తృత ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణంతోపాటు నగరంలోని ముఖ్యకూడళ్లలో పెద్ద ఎత్తున స్వాగత కటౌట్లు, తోరణాలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడంతో కరీంనగర్ గులాబీ మయంగా మారింది. సభావేదిక ఎదుట ర్యాంపు ఏర్పాటు చేశారు. ఈ ర్యాంపు పైనుంచి కేసీఆర్ అభివాదం చేసే విధంగా ఏర్పాట్లు చేశారు. కేసీఆర్ హెలీక్యాప్టర్‌లో హైదరాబాద్ నుంచి బయలు దేరి శాతవాహన యూనవర్సిటీ ప్రాంగణంలోని ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద చేరుకుంటారు. ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్, కరీంనగర్ లోక్‌సభ పార్టీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మేయర్ యాదగిరి సునీల్‌రావు, ముఖ్యనాయకులు, కార్యకర్తలతో ఏర్పాట్లు, జనసమీకరణపై సమావేశాలు నిర్వహించి సభను విజయవంతం చేయాలని కోరారు.

కదనభేరి సభను విజయవంతం చేయండి

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, మార్చి 11: జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాల మైదానంలో మంగళవారం సాయంత్రం నిర్వహిస్తున్న కదనభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కోరారు. సోమవారం సాయంత్రం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్‌కు సెంటిమెంట్ అయిన కరీంనగర్ నుంచే పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడతారని తెలిపారు. పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపించేందుకు వినోద్‌కుమార్ ఎంపీగా గెలిపించుకో వలసిన అవసరం ఉందని అన్నారు. కాంగ్రెస్ మూడునెలల పాలనలో రైతులు నీళ్ళు లేక ఇబ్బం దులు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే పంటలు ఎండిపోతున్నాయని మాజీ ఎంపీ, లోక్‌సభ అభ్యర్థి వినోద్‌కుమార్ విమర్శించారు. ఇప్పటికీ రైతు బంధు ఇవ్వలేదని, రైతులు గోస పడుతున్నారని అన్నారు. మళ్ళీ కేసీఆర్ సీఎం కావా లని ప్రజలు కోరుతున్నారని అన్నారు. కరీంనగర్ కదనభేరి సభకు కేసీఆర్ హాజరై అనేక విషయాలపై ప్రసంగిస్తారని ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎస్సారార్ కళాశాల మైదానంలో కదనభేరి బహిరంగ సభ కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలు పరిష్కరించండి

● కలెక్టర్ పమేలా సత్పతి

సుభాష్‌నగర్, మార్చి 11: ముఖ్యమంత్రి ప్రజా దర్బార్, కలెక్టరేట్‌లో ప్రజావాణికి వచ్చే దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిం చాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహిం చిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె దరఖా స్తులను స్వీక రించారు. ఈ సందర్భంగా ఆమె మాటా డుతూ ప్రజల సమస్యల పరిష్కా రానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రజా దర్బార్, ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టక రాదన్నారు. ధరణి పెండింగ్ దరఖాస్తులపై ఈనెల 13 నుంచి సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలు, తదితర అంశాలతో ఆయా మండలాల అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రతి రోజు 20 దరఖాస్తులపై సమీక్ష చేస్తానని అన్నారు. ప్రతి ఫిర్యాదుపై పూర్తి వివరాలు తెలుసుకొని పేదలకు అండగా ఉండా లని పేర్కొన్నారు. అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించా లన్నారు. ఈ అంశంలో నిర్లక్ష్యంగా ఉండకూడదని సూచించారు. ప్రజావాణికి జిల్లా వ్యాప్తంగా 330 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వ ర్యంలో నిర్వహించే పోషణ్ పక్వాడా పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మికిరణ్, డీఆర్వో పవన్‌కుమార్, ఆర్డీవో కె మహేశ్వర్, మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, మార్కెటింగ్ అధికారి పద్మావతి, మెప్మా పీడీ రవీందర్ పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి

'ఎలనాగ'కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

● ఉమ్మడి జిల్లాకు దక్కిన మరో గుర్తింపు

సిరిసిల్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు మరో సారి ఉమ్మడి జిల్లాకు దక్కింది. కరీంనగర్ జిల్లా ఎలగందుల గ్రామానికి చెందిన కవి, రచయిత, అనువాదకుడు, విమర్శకుడు డాక్టర్ ఎలనాగ (నాగరాజు సురేందర్)కు ప్రతిష్ఠాత్మకమైన కేంద్ర సాహిత్య అవార్డు అనువాద విభాగంలో గాలిబ్ నాటి కాలం పుస్తకానికి లభించింది. గతంలో ఉమ్మడి జిల్లా నుంచి అనువాదంలో గత సంవత్సరం వారాల అనంద్, అంతకుముందు డాక్టర్ నలిమెల భాస్కర్ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులను అందుకున్నారు. మరోసారి జిల్లాకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడంపై కవులు, రచయితలు డాక్టర్ ఎలనాగకు అభినందనలు తెలిపారు. ఎలగందుల గ్రామానికి చెందిన ఎలనాగ 1953లో జన్మించారు. వృత్తిరీత్యా డాక్టర్‌గా సేవలు అందించారు. 1980 నుంచి 1986 వరకు నైజీరియాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేశారు. 1989 నుంచి 2012 వరకు ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్‌లో పనిచేసి రాష్ట్ర స్థాయి అధికారిగా పదవీ విరమణ పొందారు. కరీంనగర్ నుంచి వెలువడే గౌతమి పత్రికలో హైస్కూల్ నుంచే రచనలు చేయడం ప్రారంభించారు. మెడిసిన్ చదువుతుండగా భారతి, కృష్ణపత్రిక, స్రవంతితో పాటు వివిధ ప్రధాన పత్రికల్లో రచనలు చేశారు. 2005లో సోమర్సెట్ మామ్ రచన ది ఏలియన్ కార్న్ నవలను తెలుగులో కలుపు మొక్క పేరుతో అనువాదం చేశారు. 2009లో మొదటి కవితా సంపుటి వాగంకురాలు వెలువడింది, ఇదే సంవత్సరం గేయ సంపుటి పెన్మంటలు, కోయిలమ్మ పదాలు, 2010లో సజల నయనాల కోసం, మోర్నింగ్ మీద మాల్కోస్ రాగం పద్యాల సంపుటి, 2012లో అంతర్లయ, అంతస్థాపమా, 2013లో ఉత్తమ లాటిన్ అమెరికన్ కథలు, పొరుగువెన్నెల అనువాద కవితలు, 2014లో ఉత్తమ ఆఫ్రికన్ కథలు, వట్టికోట అల్వార్ స్వామి కథలు, కాళోజీ నాగొడవ కవితలను అంగ్ల అనువాదం, ఇలా 37 పుస్తకాలను ప్రచురించారు. 2023లో ఊకీ యోటో వారి డాజ్లర్స్ వివిధ భాషల్లోకి అనువాదం చేశారు. డాక్టర్ ఎలనాగ ఇప్పటి వరకు ఓకియాటో పోయెట్ ఆఫ్‌ది అవార్డు, సోమ్‌సుందర్ పురస్కారం, అందెపల్లి పురస్కారం, జింక నాగరాజు పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం వారి కీర్తి పురస్కారం, విశ్వసాహితీ పురస్కారం, అచార్య చెన్నకేశవరెడ్డి పురస్కారం, విడుగు రామ్మూర్తి పురస్కారాలను అందుకున్నారు.





డాక్టర్ ఎలనాగ, అవార్డుకు ఎంపికైన సంకలనం.

క్రేన్ డబ్బా తెగి వ్యవసాయ కూలీ మృతి



రెడ్డి కుమారస్వామి మృతదేహం

భీమదేవరపల్లి, మార్చి 11: ప్రమాదవశాత్తు క్రేన్ డబ్బా తెగి ఓ వ్యవ సాయ రైతు కూలీ మృతి చెందాడు. భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో మారుపాక రాజమౌళి అనే రైతు వ్యవసాయ బావిలో రెడ్డి కుమారస్వామి (53) అనే రైతు పూడిక తీస్తున్నారు. క్రేన్ డబ్బాలో సోమవారం ఉదయం ఇద్దరు కూలీలు బావిలోకి దిగారు. రెడ్డి కుమారస్వామి కూడా బావిలోకి దిగేందుకు క్రేన్ డబ్బాలో బావిలోకి వెళ్తున్నాడు. క్రేన్ డబ్బా ప్రమాదవశాత్తు బావిలో పడి రెడ్డి కుమారస్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారస్వామి భార్య రమాదేవి కళ్ల ముందే భర్త చనిపోవడంతో కన్నీరుమున్నీరుగా విలపించింది. శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన రెడ్డి కుమారస్వామి ఐదేళ్ల క్రితం తన అత్తగారి ఊరు అయిన ముల్కనూర్‌కు జీవనోపాధికి వెళ్లాడు. అత్తగారి భూమితో పాటు మరొకరి వ్యవసాయ భూమి కౌలు తీసుకొని ఇతర కూలి పనులు చేసుకుంటూ కుమారస్వామి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మృతుడికి భార్య రమాదేవితో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు తెలిపారు.

పశువుల అపహరణ : పోలీసులకు ఫిర్యాదు

తిమ్మాపూర్, మార్చి11: మండలంలోని మహాత్మానగర్‌లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పలు చోట్ల ఐదు పశువులను(ఆవులను) దొంగలించుకు వెళ్లారు. శ్రీ తాపాల నృసింహస్వామి దేవాలయములోని అర్చకులలైన వేంకటాద్రి స్వామి తను పెంచుకుంటున్న రెండు ఆవులను, స్థానికులు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డికి చెందిన ఒక ఆవు, ఎడ్ల లక్ష్మారెడ్డికి చెందిన ఒక ఆవు మొత్తం నాలుగు పశువులను ఇండ్ల సమీపంలో కట్టేసి ఉండగా ఎత్తుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ స్వామి, ఎల్ఎండి ఎస్సై చేరాలు తెలిపారు.

● వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి వద్ద మానేరు వాగు నుంచి ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

ఏపీలో చంద్రబాబుపై మరో కేసు

» అసైన్డ్ భూముల కేసులో ఏ-40గా చేర్చిన సీఐడీ

విజయవాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబుపై రాష్ట్ర ప్రభుత్వం మరో కేసు నమోదు చేసింది. ఇప్పటి వరకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఫైబర్‌గ్రిడ్ కేసుల్లో నిందితుడిగా చేర్చిన సీఐడీ.. తాజాగా అసైన్డ్ భూముల కేసు ఎఫ్‌ఐఆర్‌లోనే గాక చార్జిషీటులోనూ నిందితుడి(ఏ-40)గా పేర్కొంది. రాజధాని అమరావతిలో వెలగపూడి, ఉద్దండరాయునిపాలెం, మందడం, రాయపూడి గ్రామాల్లో ఉన్న అసైన్డ్ భూములను బినామీ పేర్లతో కొనుగోలు చేశారని వరప్రసాదరావు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై మాజీ మంత్రి పి.నారాయణ, ఆయన కుటుంబ సభ్యులపై సీఐడీ గతంలో కేసులు (క్రైం నంబర్ 14/2020, 15/2020) నమోదు చేసింది. ఈ ఎఫ్‌ఐఆర్‌లలో ఎక్కడా చంద్రబాబు పేరు లేదు. ఇప్పుడు 14/2020 కేసులో ఆయనతో పాటు 22 మందిని నిందితులుగా పేర్కొంటూ విజయవాడ ఏసీబీ కోర్టులో సోమవారం చార్జిషీటు, మెమో దాఖలు చేసింది. వీరిలో నారాయణ బంధువు పి.సుబ్రహ్మణ్యాన్ని ఏ-41గా చేర్చింది. వీరందరిపై ఐపీసీ 120బీ, 420, 506 రెడ్‌విత్ 120బీ సెక్షన్లు, అసైన్డ్ భూముల బదిలీ నిషేధం చట్టంలోని సెక్షన్ 7, ఎస్సీ, ఎస్టీ చట్టంలోని 3(1)(జీ), (2)(వీఏ) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. 2 కేసులకు సంబంధించి ఒకటే చార్జిషీటును కోర్టుకు సమర్పించారు. కాగా, యువగళం ముగింపు సభలో లోకేశ్ చేసిన రెడ్‌బుక్ వ్యాఖ్యలపై సీఐడీ వేసిన పిటిషన్‌పై విచారణ 21వ తేదీకి వాయిదా వేసింది. ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలుకు ఆయన తరఫు న్యాయవాది లక్ష్మీనారాయణ సమయం కోరారు. ఈ కేసుకు సంబంధించిన పిటిషన్లు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీంతో న్యాయాధికారి హిమబిందు విచారణను 21వ తేదీకి వాయిదా వేశారు.








నేటి నుంచే రంజాన్

(మొదటి పేజీ తరువాయి)

ముస్లింలు భావిస్తారు. అలాగే ఎంతో శుభప్రదమైన ఈ నెలలో నరకలోక ద్వారాలు మూసుకుని, స్వర్గలోకపు ద్వారాలు తెరుచుకుంటాయని వారు నమ్ముతారు. దేవునిపై విశ్వాసాన్ని, భయభక్తులను, భక్తిశ్రద్ధలను తెలుపుకునేందుకు ముస్లింలు రోజా (ఉపవాస దీక్షలు) పాటిస్తారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటిస్తూ ఐదుపూటలా నమాజు, ఇషా తరువాత తరావీహ్ (ప్రత్యేక ప్రార్థనలే)తో పాటు అర్ధరాత్రి పూట తహజ్జుద్ నమాజ్ పేరుతో ఏకాంత ఆరాధనలో లీనమవుతుంటారు. చివరి పది రోజులలో ఎతేకాఫ్ పాటిస్తారు. అలాగే ధనవంతుడైన ప్రతి ముస్లిం దానధర్మాలకు అధిక ప్రాధాన్యమిస్తారు. తమ ఆస్తిలో రెండున్నర శాతం తీసి పేదలకు పంచిపెడతారు. నెల రోజుల అనంతరం నెలవంక దర్శనంతో ఉపవాస దీక్షలను ముగించి రంజాన్ పండుగ (ఈదుల్ ఫితర్)ను జరుపుకుంటారు. మరోవైపు రంజాన్ నెలవంక దర్శనంతో సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని పాతబస్తీలో మటన్, చికెన్ షాపులు, కూరగాయల మార్కెట్‌లు, కిరాణా షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.



ముస్లింలకు సీఎం రంజాన్ శుభాకాంక్షలు

నెలవంక దర్శనంతో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా ముస్లింలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం ఆదర్శవంతమైన జీవనానికి ప్రేరణనిస్తుందని అన్నారు. ముస్లిం సోదరులు రంజాన్ మాస వేడుకలను సుఖసంతోషాలతో జరుపుకోవాలని, ప్రార్థనలతో అల్లా దీవెనలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ముస్లిం మైనారిటీల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని చెప్పారు. ముస్లింల సంక్షేమానికి అవసరమైన నిధులు కేటాయించి, వారి అభ్యున్నతికి తోడ్పడే కార్యక్రమాలు అమలు చేస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

ఆనాడు కేసీఆర్ పేషీలో
ఒక్క దళితుడున్నారా?

చిన్న సంఘటనపై బీఆర్ఎస్ విష ప్రచారం.. ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్, బీర్ల అయిలయ్య

హైదరాబాద్/న్యూఢిల్లీ/జగిత్యాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఆయన పేషీలో ఒక్క దళితుడైనా ఉన్నారా అంటూ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రశ్నించారు. యాదగిరిగుట్టలో జరిగిన చిన్న సంఘటనను చూపి ఏదో అయినట్లు బీఆర్ఎస్ సోషల్ మీడియా తప్పుడు చేస్తోందని మండిపడ్డారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు.. తెలంగాణ తొలి సీఎంగా దళితుడిని చేస్తానన్న కేసీఆర్.. చేశాడా అని ప్రశ్నించారు. మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఆయన ఎలా అవమానించిందీ ప్రజలే చూశారన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు దళిత మంత్రులు ఎన్నిసార్లు కలవగలిగారని ప్రశ్నించారు. యాదగిరిగుట్టలో పూర్వమున్న వసతులనూ సీఎం రేవంత్ కల్పిస్తున్నారని.. గుట్టలో నిద్రచేసే వెసులుబాటు, కొబ్బరికాయలు కొట్టేందుకు ఏర్పాట్లు చేశారని విప్ అయిలయ్య అన్నారు. కాంగ్రెస్‌కు క్రెడిట్ దక్కుతుందని చెప్పి.. డిప్యూటీ సీఎం భట్టికి అవమానం జరిగిందంటూ బీఆర్ఎస్ విష ప్రచారం చేస్తుందని దుయ్యబట్టారు. భట్టి కూర్చున్న కుర్చీ చిన్నగా ఉన్నందు వల్ల అలా కనిపిస్తోందని వివరణ ఇచ్చారు. మేనేజ్‌మెంట్ కోటాలో వచ్చిన కేటీఆర్‌కు.. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదని కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ అన్నారు. సీఎంను గురించి ఆయన పిచ్చిమాటలు మాట్లాడితే ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రిలో చేర్చడం ఖాయమని వ్యాఖ్యానించారు. రేవంత్ గురించి అనవసర వ్యాఖ్యలు చేస్తే హైదరాబాద్‌లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. తెలంగాణ ప్రజల్లో సీఎం రేవంత్‌కు ఉన్న ఆదరణ చూసి కేటీఆర్ ఓర్చుకోలేకపోతున్నారని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. 'బిడ్డా కేటీఆర్..! మా సీఎం రేవంత్‌పైన మాట్లాడే స్థాయి నీకుందా? నీ భాష మార్చుకోక పోతే బట్టలు ఊడదీసి ఉరికిస్తం.. నువ్వు మొగోనివైతే లోక్‌సభ ఎన్నికల్లో సిరిసిల్లలో మెజారిటీ తెచ్చి చూపించు!'అని సవాల్ విసిరారు. రేవంత్ పట్ల కేటీఆర్ మాట్లాడిన తీరు జుగుప్సాకరంగా ఉందంటూ టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. కేసీఆర్ ఎక్కడ రాజకీయాలు మొదలుపెట్టి ఎక్కడ మంత్రి, డిప్యూటీస్పీకర్ అయ్యారో కేటీఆర్ చెప్పాలన్నారు. కేటీఆర్ ఇలాగే మాట్లాడితే తెలంగాణ ప్రజలు.. బీఆర్ఎస్‌కు ఉన్న ప్రతిపక్ష హోదా లేకుండా చేసి బయటకు పంపుతారన్నారు.



జగిత్యాల మునిసిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

రెండ్రోజుల్లో గొల్లకురమల కార్పొరేషన్

గొల్ల, కురమల కార్పొరేషన్‌ను మరో రెండ్రోజుల్లో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఏర్పాటుతో గొల్ల, కురుమలకు లబ్ధి చేకూర్చుతుందన్నారు. గొల్ల కురమలకు బీఆర్ఎస్ పదేళ్ల పాటు అన్యాయం చేసిందని మండిపడ్డారు. గొల్ల కురుమలకు 4 అసెంబ్లీ సీట్లు కేటాయించి.. అధికారంలోకి రాగానే కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని సీఎం రేవంత్ నిలబెట్టుకుంటున్నారని వెల్లడించారు.

మోదీకి చిత్తశుద్ధి లేదు:వీహెచ్

ఓబీసీ ప్రధాని అని చెప్పుకొనే నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి బీసీలకు ఏం చెప్తారని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ప్రశ్నించారు. కులగణన చేస్తామని ప్రకటించడానికి వస్తున్నారా? అని నిలదీశారు. ఓట్ల కోసం అయోధ్య రామమందిరం, కాశీ గురించి మాట్లాడడమే తప్ప బీసీల అభివృద్ధి పట్ల ఆయనకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో వీహెచ్ మాట్లాడుతూ.. కులగణన కోసం మోదీని ఓబీసీ ఎంపీల బృందం ఆధ్వర్యంలో నాలుగు సార్లు కలిసినప్పటికీ హామీ ఇవ్వలేదన్నారు. కాగా, జగిత్యాలలో ఇటీవల జరిగిన మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ రెబల్‌గా పోటీ చేసి విజయం సాధించిన అడువాల జ్యోతి లక్ష్మణ్ కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం జగిత్యాలలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

22 ఎకరాల నిషేధిత జాబితా భూమి..
ఎంపీ సంతోష్‌కు పట్టా

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. "సంతోష్ అనే బీఆర్ఎస్ ఎంపీ, వారి కుటుంబానికి చెందినవారి పేరుమీద కూడా భూములున్నాయి. అప్పటివరకు 22(ఎ) కింద నిషేధిత జాబితాలో ఉన్న భూమి వారి పేరిట పట్టా అయింది. ఆ గ్రామంలో అందరి భూములూ నిషేధిత జాబితాలో ఉంటాయి. కానీ, ఆయనకు మాత్రం ఆ 22 ఎకరాలు పట్టా అయిపోయింది" అని కోదండరెడ్డి అన్నారు. ఎంపీ సంతోష్ భార్య, ఓ ఎమ్మెల్సీ, ఇద్దరు ఆ పార్టీ నేతలు కలిసి ఒకే గ్రామంలో నిషేధిత జాబితాలో ఉన్న 22 ఎకరాలను తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఈ నలుగురికి చెందిన ఒక కంపెనీ పేరుతో ఈ భూముల్ని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వెల్లడించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను ఎలా పట్టాలుగా మార్చుకున్నారనేందుకు ఇది ఒక్క ఉదాహరణ మాత్రమేనన్నారు. ఇలాంటి రిజిస్ట్రేషన్లపై తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. మరోవైపు వివాదరహితంగా ఉన్న 23 లక్షల ఎకరాలను వివాదాస్పద భూముల కేటగిరీ(బీ)లో చేర్చారని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగనన్ని భూ కుంభకోణాలు ఇక్కడ గత ప్రభుత్వ హయాంలో జరిగాయని ధ్వజమెత్తారు. ఎవరినీ సంప్రదించకుండా గతంలో దివాళా తీసిన విదేశీ ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీకి ధరణి నిర్వహణ బాధ్యతలు అప్పగించారని కోదండరెడ్డి తెలిపారు. ఆ తర్వాత ఇదే కంపెనీ టెరాసీస్, క్వాంటెల్లాగా పేర్లు మార్చుకుందని వివరించారు. ఈ మూడు కంపెనీలు రాష్ట్రానికి చెందిన రామలింగరాజు కుటుంబీకుడు శ్రీగారి శ్రీధర్‌రాజు పేరిట ఉన్నాయని తెలిపారు. రామలింగరాజు కుటుంబానికి కేటీఆర్‌తో అవినాభావ సంబంధం ఉందన్నారు. ధరణి పేరుతో కేసీఆర్ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని, ఆ శాఖ మంత్రిగా కూడా ఉన్న గత సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ దీనికి ప్రధాన కారణమని కోదండరెడ్డి ఆరోపించారు. కేటీఆర్ తన కార్యాలయంలో ధరణికి సంబంధించి ప్రత్యేకంగా ఒక వ్యవస్థనే పెట్టుకున్నారని తెలిపారు.

17 వరకు స్పెషల్ డ్రైవ్..

ధరణి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రారంభించిన స్పెషల్ డ్రైవ్‌ను మరో వారం రోజులపాటు పొడిగించారు. దరఖాస్తులు భారీగా వస్తున్నందున దీనిని ఈ నెల 17 వరకు పొడిగిస్తున్నట్లు పేర్కొంటూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు 2.45 లక్షల ధరణి దరఖాస్తులు పరిష్కారం దిశగా ఉన్నాయని తెలిపింది.

ప్రణీత్‌రావు ఎక్కడ?

» సిరిసిల్లలో పంజాగుట్ట పోలీసుల గాలింపు
» అదుపులోకి తీసుకున్నట్లుగానూ ప్రచారం?
» పథకం ప్రకారమే ట్యాపింగ్.. డేటా మాయం
» హార్డ్ డిస్క్‌ల ధ్వంసం కేసులో కీలక ఆధారాలు
» గత ప్రభుత్వ పెద్దల అండతో ఎస్ఐబీలో హవా
» ప్రతిఫలంగానే అడ్డదారిలో ఆయనకు పదోన్నతి?
» ప్రణీత్‌కు సహకరించిన అధికారుల్లో గుబులు

హైదరాబాద్ సిటీ, సిరిసిల్ల క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సస్పెండైన డీఎస్పీ ప్రణీత్‌కుమార్ అలియాస్ ప్రణీత్‌రావు ఎక్కడ ఉన్నారనేది తెలియడం లేదు. ఫోన్‌లు స్విచ్చాఫ్ ఉండడంతో పాటు, అజ్ఞాతంలోకి వెళ్లినట్లు అనుమానిస్తూ ఆయనను పట్టుకునేందుకు హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సోమవారం వీరు సిరిసిల్ల వచ్చి స్థానిక శ్రీనగర్ కాలనీలో ప్రణీత్ అద్దెకు ఉంటున్న ఇంటి వద్ద రాత్రి వరకు పహారా కాసినట్లు తెలిసింది. ఓ దశలో అదుపులోకి తీసుకున్నారని, రహస్య ప్రాంతంలో విచారిస్తున్నట్లు ప్రచారం జరిగింది. ఏ సమయంలోనైనా హైదరాబాద్ తరలించే అవకాశం ఉందని ఊహాగానాలు వచ్చాయి. అయితే, ప్రణీత్ విషయం తమకు తెలియదని, పంజాగుట్ట పోలీసులకే సమాచారం ఉంటుందని సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. పంజాగుట్ట పోలీసులు సైతం ప్రణీత్ ఇంకా దొరకలేదని చెప్పారు. హైదరాబాద్‌లోని స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) డీఎస్పీగా పనిచేస్తున్న ప్రణీత్ ఫిబ్రవరి 20న బదిలీపై సిరిసిల్ల డీసీఆర్బీలో చేరారు. రిపోర్టు చేసిన వెంటనే హైదరాబాద్ వెళ్లిపోయినట్లు తెలిసింది. ట్యాపింగ్ ఆరోపణలతో ఈ నెల 5న సస్పెండయ్యారు. కాగా, ఎస్ఐబీ కార్యాలయంలో.. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుసటి రోజు ప్రతిపక్ష నాయకుల ఫోన్ల ట్యాపింగ్‌కు సంబంధించిన హార్డ్ డిస్క్‌లను ప్రణీత్ ధ్వంసం చేశారని ఆదివారం అదనపు ఎస్పీ రమేష్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ప్రణీత్‌తో పాటు, మరికొందరిపై పంజాగుట్ట స్టేషన్‌లో ఐపీసీ 409, 427, 201, 120(బి), సెక్షన్(3) ఆఫ్ పీడీపీపీ యాక్ట్, 65, 66, 70 ఆఫ్ ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదయ్యాయి.

పథకం ప్రకారం ఎస్ఐబీకి.. 'అద్భుత పనితీరు'తో డీఎస్పీ

గత ప్రభుత్వంలోని పెద్దలతో దగ్గరి బంధుత్వం ఉండడం, వారి అండతో ప్రణీత్ పథకం ప్రకారం ఎస్ఐబీకి వెళ్లి చక్రంతిప్పినట్లు పోలీసులు కీలక సమాచారం సేకరించారు. 2007 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఆయన 2018లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. అనంతరం ఎస్ఐబీకి మార్చగా ఆ విభాగం ఉన్నతాధికారుల తోడ్పాటుతో రెండు గదుల్లో ఇంటర్నెట్ కనెక్షన్‌తో 17 కంప్యూటర్లను అనధికారికంగా ఏర్పాటు చేసుకున్నారు. వ్యక్తుల సమాచారాన్ని రహస్యంగా, అనధికారికంగా, చట్ట విరుద్ధంగా సేకరించడమే కాక స్వయంగా పర్యవేక్షించినట్లు కచ్చితమైన ఆధారాలు లభించినట్లు తెలిసింది. ఎన్నికల ఫలితాలు విడుదలైన మరుసటి రోజే ఎస్ఐబీ కార్యాలయంలో సీసీ కెమెరాలు బంద్ చేయించి, టెక్నీషియన్ సాయంతో కంప్యూటర్లలోని డేటా, కీలక వివరాలు కాపీ చేసుకుని, హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేసి కాల్చివేశారు. తనపై అనుమానం రాకుండా కొత్త హార్డ్ డిస్క్‌లను ఏర్పాటు చేసినట్లు విచారణలో తేలింది. కాగా, చెప్పినట్లు చేసినందుకు 'అద్భుతమైన పనితీరు' కింద నిరుడు మార్చిలో ప్రణీత్‌కు డీఎస్పీగా పదోన్నతి ఇచ్చారు. దీనిపై ఆయన బ్యాచ్‌మేట్స్, ఉన్నతాధికారులు సైతం ఆశ్చర్యపోయినట్లు తెలిసింది. మరోవైపు ట్యాపింగ్‌లో కొందరు అధికారులకూ పాత్ర ఉన్నట్లు ఆధారాలు లభ్యమయ్యాయి. ప్రణీత్ తర్వాత వీరినీ విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రాథమిక సమాచారం మేరకు ఈ కుట్రలో ఎవరి పాత్ర ఎంత..? అనేది దానిపై దర్యాప్తు చేస్తున్నారు. కేసు సంచలనంగా మారుతుండడంతో ప్రణీత్ కు సహకరించిన ఉన్నతాధికారుల్లో గుబులు మొదలైంది.

సీఎం సార్... మా మొర ఆలకించండి!

» ఆర్ అండ్ బీలో సర్వీస్ రూల్స్ ఖరారు చేయండి
» సీఎం రేవంత్‌కు, మంత్రి కోమటిరెడ్డికి ఉద్యోగుల విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్ అంశాన్ని పరిష్కరించాలని ఆ శాఖ ఉద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరారు. గత ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, దాంతో తమకు పదోన్నతులు వచ్చినా అవి తాత్కాలికమే కావడంతో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ స్థాయి హోదాలోనే పదవీ విరమణ చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఆర్ అండ్ బీ లో పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్‌ను పరిష్కరిస్తే దాదాపు 300 నుంచి 400 మంది ఉద్యోగులకు పదోన్నతులు కలుగుతాయన్నారు. వాస్తవానికి ఆర్ అండ్ బీ పదోన్నతుల అంశం ఆంధ్రప్రదేశ్ నుంచి రావాల్సిన సీనియారిటీ జాబితాపై ఆధారపడి ఉన్నప్పటికీ సర్వీస్ రూల్స్ తేలితే కిందిస్థాయి పదోన్నతులు ఒక కొలిక్కి వస్తాయని ఉద్యోగులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల్లో సర్వీస్ రూల్స్ పూర్తయ్యాయని, తమ శాఖలోనూ అందుకు సంబంధించిన ప్రక్రియ మొత్తం పూర్తయినా గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పెండింగ్‌లో ఉండిపోయిందని పలువురు ఉద్యోగులు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. కాగా సర్వీస్‌రూల్స్‌ను ఖరారు చేస్తే ఆర్ అండ్ బీలో జరిగిన పునర్వ్యవస్థీకరణతో ఏర్పడిన కొత్త కార్యాలయాలకు సిబ్బంది పూర్తిస్థాయిలో వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

తవ్విన కొద్దీ బయటపడుతున్న
అక్రమ పౌరసత్వాలు!

» తాజాగా 125 పెరిగిన సంఖ్య.. 24 మంది అరెస్టు

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విదేశీయులకు అడ్డదారుల్లో పౌరసత్వం ఇచ్చిన కేసులో సీఐడీ దర్యాప్తును ముమ్మరం చేసింది. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించి.. నకిలీ గుర్తింపు, విద్య, ఇతర ధ్రువీకరణ పత్రాలు పొంది.. వాటి ఆధారంగా పాస్‌పోర్టులు పొందిన వారి సంఖ్య తొలుత 95గా గుర్తించిన విషయం తెలిసిందే. ఈ కేసుకు అనుబంధంగా మరికొన్ని చోట్ల ఎఫ్‌ఐఆర్‌లు నమోదవుతుండడం.. ఈ ముఠాలకు పశ్చిమబెంగాల్‌లోని ఫేక్ సర్టిఫికెట్ల గ్యాంగ్‌తో లింకులను సీఐడీ నిర్ధారించింది. కొత్తగా మరో 30 మంది ఇలా అక్రమంగా పాస్‌పోర్టులు తీసుకున్నట్లు గుర్తించారు. దీంతో.. నకిలీ పత్రాలతో పౌరసత్వాన్ని పొందిన విదేశీయుల సంఖ్య 125కు చేరింది. చెన్నైకి చెందిన పాస్‌పోర్టు ఏజెంట్ మురళీధరన్ రాధ ఈ కేసులో కీలకంగా వ్యవహరించినట్లు తేల్చారు. మరింత లోతుగా దర్యాప్తు చేస్తే.. ఈ సంఖ్య మరింత పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. కాగా.. ఈ కేసులో సీఐడీ ఇప్పటి వరకు 24 మందిని అరెస్టు చేసింది. విదేశాలకు వెళ్లినట్లు గుర్తించిన వ్యక్తుల వివరాలను ఇప్పటికే ఇమిగ్రేషన్, పాస్‌పోర్టు అధికారులు అందజేశామని, వారిని భారత్‌కు రప్పించే ఏర్పాట్లు జరుగుతున్నాయని సీఐడీ అధికారులు వెల్లడించారు. ఇప్పటి వరకు అరెస్టయిన వారిలో హైదరాబాద్‌కు చెందిన ఫేక్‌సర్టిఫికెట్ల తయారీదారుడు అబ్దుల్ సత్తార్, డి.అశోక్‌రావు, మరియప్పన్, మునీందర్, చాంద్‌ఖాన్, హబీబుల్లా జైలులో ఉండగా.. మిగతా వారు బెయిల్‌పై బయటకు వచ్చారు.

ఏపీలో బీజేపీకి 6 ఎంపీ, 10 అసెంబ్లీ సీట్లు

» 144 అసెంబ్లీ, 17 లోక్‌సభ స్థానాల్లో టీడీపీ పోటీ
» 8 గంటలపాటు మూడు పార్టీల నేతల భేటీ

అమరావతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పొత్తుల్లో ఎవరికి ఎన్ని సీట్లు అనే అంశంపై టీడీపీ, జనసేన, బీజేపీ తుది నిర్ణయానికి వచ్చాయి. సోమవారం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, బీజేపీ ప్రతినిధులుగా కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, ఎంపీ వైజయంత్ పాండే సుమారు 8 గంటలు చర్చలు జరిపారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఈ భేటీ జరిగింది. అనంతరం... ఏ పార్టీ ఎన్ని సీట్లలో పోటీ చేయనున్నదీ వివరిస్తూ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. దీని ప్రకారం... తెలుగుదేశం పార్టీ 17 పార్లమెంటు, 144 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తుంది. జనసేన రెండు లోక్‌సభ, 21 అసెంబ్లీ స్థానాల్లో బరిలో దిగనుంది. ఇక.. బీజేపీ ఆరు పార్లమెంటు, పది అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయనుంది. పొత్తుల్లో భాగంగా బీజేపీ, జనసేనకు కలిపి 8 పార్లమెంటు, 30 అసెంబ్లీ స్థానాలను ఇవ్వాలని తొలుత భావించారు. ఇప్పుడు... అసెంబ్లీ స్థానాల సంఖ్య 31కి పెరిగింది. తొలుత జనసేనకు 24 అసెంబ్లీ, మూడు పార్లమెంటు సీట్లు ఇచ్చారు. బీజేపీతో పొత్తు అనంతరం జనసేన ఒక ఎంపీ స్థానాన్ని, 3 అసెంబ్లీ స్థానాలను త్యాగం చేయాల్సి వచ్చింది. టీడీపీ కూడా ఒక అసెంబ్లీ స్థానాన్ని తగ్గించుకోవాల్సి వచ్చింది.

వివేకా హత్య కేసులో శివశంకర్‌రెడ్డికి బెయిల్

» సీబీఐ కోర్టు అనుమతి లేకుండా ఆంధ్రలో అడుగుపెట్టొద్దు
» రెండు పూచీకత్తులు సమర్పించాలి: తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్మోహన్‌రెడ్డి చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక నిందితుడు (ఏ-5) దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టు సోమవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో అధిక శాతం సాక్షులు ఉన్న ఆంధ్ర రాష్ట్రంలోకి సీబీఐ కోర్టు అనుమతి లేకుండా ప్రవేశించరాదని స్పష్టం చేసింది. రూ.2 లక్షల వ్యక్తిగత బాండ్, రెండు పూచీకత్తులు సమర్పించాలని.. ప్రతి సోమవారం హైదరాబాద్ సెంట్రల్ క్రైం స్టేషన్ (సీసీఎస్)లో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. పిటిషనర్ సీబీఐ కోర్టులో పాస్‌పోర్ట్ సరెండర్ చేయాలని.. దర్యాప్తునకు సహకరించాలని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం ఆదేశాలిచ్చారు. శివశంకర్‌రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను గతేడాది సెప్టెంబర్లో హైదరాబాద్ సీబీఐ కోర్టు కొట్టివేసింది. ఈ హత్య కేసులో 2021 నవంబర్ నుంచి జైల్లో ఉంటున్నానని.. సీబీఐ కోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టేసి బెయిల్ మంజూరు చేయాలని ఆయన తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ మేరకు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తున్నట్లు పేర్కొంది. ఆయన సాక్షులను ప్రభావితం చేస్తే సీబీఐ లేదా సునీతారెడ్డి ఆయన బెయిల్ రద్దుచేయాలని కోరవచ్చంటూ విచారణను ముగించింది.

జేబీబీ పార్టీలో చేరిన కోడికత్తి శ్రీను

» అమలాపురం నుంచి ఎన్నికల బరిలోకి...

విజయవాడ(ఆంధ్రజ్యోతి), ముమ్మిడివరం, మార్చి 11: జనిపల్లి శ్రీనివాసరావు(కోడికత్తి శ్రీను) రాజకీయ రంగప్రవేశం చేశారు. సోమవారం ఆయన జై భీమ్‌రావ్ భారత్ పార్టీలో చేరారు. విజయవాడలోని ఆ పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. కాగా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం ఠాణేలంక పెదపేటలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సమాజంలో సామాన్యులకు న్యాయం జరిగే వరకు తాను పోరాటం సాగిస్తానని ప్రకటించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నా అవి సక్రమంగా అర్హులకు చేరడం లేదన్నారు. అమలాపురం అసెంబ్లీ స్థానం నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించారు.

మా కుటుంబం త్వరలోనే టీడీపీలోకి: మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 11: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కలయికతో అద్భుతాలు జరుగడం ఖాయమని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. ప్రకాశం జిల్లాలో కూటమి అభ్యర్థులు విజయకేతనం ఎగురవేసే విధంగా కృషిచేస్తానని తెలిపారు. సోమవారమిక్కడ ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తన కుమారుడు రాఘవరెడ్డితో కలిసి తాను పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు.

'వింధ్యావాలి'లో ఘనంగా ఫేర్‌వెల్ డే



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

కరీంనగర్‌కల్చరల్, మార్చి 11: నగరంలోని మెహర్‌నగర్ వింధ్యావాలి ఉన్నత పాఠశాలలో బొన్‌వోయేజ్ పేరుతో సోమవారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ ఆర్.పృథ్విరావు, ప్రిన్సిపాల్ జి.ప్రశాంత్‌లు జ్యోతి ప్రజ్వళన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో రామవరం నేహాహరీష్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 612 మంది గైర్హాజరు

కరీంనగర్ టౌన్, మార్చి 11: ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్‌లో సోమవారం నిర్వహించిన ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు జనరల్ విభాగంలో 402మంది, ఒకేషనల్ విభాగంలో 210 మంది మొత్తం 612 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 15,669 మంది, ఒకేషనల్‌లో 1656 మంది మొత్తం 17,325 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి తెలిపారు.

నిబంధనలు పాటించని మెడికల్ షాపులపై చర్య తీసుకోవాలి

సుభాష్‌నగర్, మార్చి 11: నాసిరకం మందులను విక్రయిస్తున్న మెడికల్ షాపులపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు.కొన్నిషాపుల్లో అర్హతలేని వారు మందులను అమ్ము తున్నారని ఆరోపించారు. జనరిక్ మందులకు ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు మురళి, బూడిద కుమార్ పాల్గొన్నారు.

జేఎల్‌ఎం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

గణేశ్‌నగర్, మార్చి11: జూనియర్ లైన్‌మెన్ అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కే ఆరవ విడత పరీక్షలను సోమవారం టీఎస్ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించినట్లు విద్యుత్ శాఖ ఎస్‌ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం అభ్యర్థులు 12 మంది ఉండగా పదిమంది హాజరైనట్లు తెలిపారు. ఈఎన్నిక కమిటీలో చైర్మన్ వడ్లకొండ గంగాధర్, అబ్జర్వర్ సిజిఎం హెచ్ఆర్డి ప్రభాకర్, డీఈలు విజయేందర్ రెడ్డి ,ఈశ్వర్ ప్రసాద్ ,పి ఓ బి. చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు కోరా విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని యోగేశ్వరిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి11: నగరంలోని కోరా ఉన్నత పాఠశాలలో చదువుతున్న యోగేశ్వరి అనే తొమ్మిదో తరగతి విద్యార్థి జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈనెల 15న ఉత్తరప్రదేశ్‌లోని దాద్రా ప్రదేశంలో ఆనంద్ ఇంటర్నేషనల్ పబ్లిక్‌స్కూల్లో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో యోగేశ్వరి పాల్గొన నుంది. దీనికి గాను పాఠశాల యాజమాన్యం విద్యార్థికి పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్ రాంరెడ్డి, సింహాచలం హరిక్రిష్ణ, వంగళ సంతోష్‌రెడ్డి విద్యార్థిని, తల్లిదండ్రులను సత్కరించారు.

'పేదల పక్షాన పోరాడిన వీరుడు అనభేరి'

భగత్‌నగర్, మార్చి 11: నిజాం సర్కారుకు వ్యతిరేకంగా పేదల పక్షాన పోరాటం చేసిన వీరుడు అనభేరి ప్రభాకర్‌రావు అని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నగర సమితి శాఖ కార్యదర్శిల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 14న సాయుధ పోరాట యోధుడు అనభేరి వర్ధంతిని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ శాఖ కార్యదర్శులు పైడిపల్లి రాజు, కిన్నెర మల్లవ్వ, కటికరెడ్డి బుచ్చన్నయాదవ్, న్యాలపట్ల రాజు, చెంచల మురళి, కేమసారం నర్సయ్య, సాయవేని రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ.. తప్పిన ప్రమాదం

తిమ్మాపూర్, మార్చి11: వంట గ్యాస్ సిలిండర్ల లోడ్‌తో వెళుతున్న ఓ లారీ డ్రైవర్ కునుకుపాటుతో డివైడర్‌ను ఢీకొని అవతలి వైపున వెళ్తున్న కారును ఢీకొన్న సంఘటనలో ముగ్గురు గాయపడ్డారు. సోమవారం ఉదయం అలుగునూర్ వద్ద రాజీవ్ రహదారిపై ఈ ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదారాబాద్ వైపు నుంచి కరీంనగర్ వైపు వంట గ్యాస్ సిలిండర్ల లోడ్‌తో వెళ్తున్న లారీ అలుగునూర్‌లోని నర్సరీల వద్దకు చేరుకోగానే లారీ డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా నడపడంతో రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ ఎక్కి అవతలి వైపు రోడ్డుపై వెళ్తున్న ఓ కారును ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని గాయపడ్డ ముగ్గురిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

ఎల్లంపల్లి పైపులైన్‌ను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు

గంగాధర, మార్చి11: ఎల్లంపల్లి పైపులైన్‌ను సోమవారం నీటి పారుదల శాఖ అధికారులు పరిశీలించారు. రెండు రోజులుగా ఎల్లంపల్లి నీటిని నారాయణపూర్ రిజర్వాయర్‌లోకి విడుదల చేస్తున్నారు. ఇందులో భాగంగా మేడారం నుంచి నారాయణపూర్ రిజర్వాయర్ వరకు వేసిన పైపులను ఎస్‌ఈ అశోక్, ఈఈలు గుప్త, సంతుప్రకాశ్, డీఈ, ఏఈలు పరిశీలించారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

చిగురుమామిడి,మార్చి 11: మండలంలోని ఉల్లంపల్లిలో ఓ మైనర్‌కు వివా హం చేస్తున్నట్లు తెలుసుకున్న తహశీల్దార్ ఇప్ప నరేందర్, ఐసిడిఎస్ అధికా రులు సోమవారం గ్రామానికి వెళ్లి బాల్య వివాహం అడ్డుకున్నారు. ఈ సందర్భం గా బాలిక తల్లితండ్రులకు బాల్య వివాహలపై అవగాహన కల్పించారు.

నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, మార్చి 11: కరీంనగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి సుందరనగరంగా తీర్చిదిద్దేం దుకు తమ పాలకవర్గం కృషి చేస్తుందని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. సోమవారం 9,11, 27 డివిజన్లలో మేయర్ సునీల్‌రావు పర్యటించి ఆయా డివిజన్ కార్పొరేటర్లతో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. 9,11 డివిజన్లలో 21 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టిన తర్వాత 27 డివిజన్ హౌస్సేనిపురాలో ఇటీవల ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ అభివృద్ధి నిరంతర ప్రక్రియ అన్నారు. ఇంకా శివారు కాలనీలు, విలీన డివిజన్లలో మిగిలిన పనులన్నిటిని వేసవిలోగా పూర్తి చేస్తామని మేయర్ యాదగిరి సునీల్‌రావు చెప్పారు. నగరంలో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా అన్ని ముందస్తు చర్యలు చేపడు తున్నామన్నారు. ప్రభుత్వం లోయర్ మానేరు డ్యామ్‌కు ఎస్సారెస్పీ నుంచి ఐదు టీఎంసీల నీటిని విడుదల చేస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంచి నీటిని అందిస్తామని చెప్పారు.

నగర అభివృద్ధికి ప్రజలు సహక రించాలని ఈసందర్భంగా మేయర్ యాదగిరి సునీల్ రావు కోరారు. ఈకార్యక్రమాల్లో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు జంగిలి ఐలేందర్ యాదవ్, ఆకుల నర్మదా నర్సయ్య పటేల్, గౌసియా బేగం, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలు ఈసీకి అందించాలి

భగత్‌నగర్, మార్చి11: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల బాండ్ల వివరాలను ఎన్నికల కమిషన్‌కు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. సీపీఎం పొలిట్ బ్యూరో పిలుపుమేరకు సోమవారం నగరంలోని ఎస్‌బీఐ ప్రాంతీయ కార్యాలయం ముందు ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గీట్ల ముకుందరెడ్డి, వర్ణవెంకట్‌రెడ్డి, గుడికందులసత్యం, యు శ్రీనివాస్, ఎడ్ల రమేష్, నరేష్ పటేల్, కోనేటి నాగమణి, గజ్జల శ్రీకాంత్, తిప్పారపు సురేష్, పున్నం రవి, కాంపెల్లి అరవింద్, సాయి, శ్రీకాంత్ చందు, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

సర్వే బిల్లులు ఇప్పించాలి

సుభాష్‌నగర్, మార్చి 10: పెండింగ్‌లో ఉన్న జీతాలు, లెప్రసీ సర్వే బిల్లులు మంజూరు చేయాలని తెలంగాణ అర్బన్ హెల్త్ సెంటర్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) బాధ్యులు కోరారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో బి.సంపూర్ణ, సిహెచ్.స్వరూప, ఎం.సంతో షిణి, ఎం.రమాదేవి, ఐ.పూలమ్మ, పి.స్రవంతి, రాజశ్రీ, ముబినా పాల్గొన్నారు.

●సుభాష్‌నగర్: రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న లెప్రసీ సర్వే బిల్లులు ఇప్పించాలని తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల(ఆశా) సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎండి రబియాబేగం, దొండపాటి సరిత కోరారు. సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు రంగనేని శారద, ఉపాధ్యక్షులు సరిత, రజిత, అంజలి, సహాయ కార్యదర్శులు లక్ష్మీకవిత, సత్యలక్ష్మి, నాగమణి, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయమే ఎజెండాగా పనిచేయాలి

సుభాష్‌నగర్, మార్చి 11: సామాజిక న్యాయమే ప్రధాన ఎజెండాగా ప్రభుత్వం పాలన కొనసాగించాలని పలువురు ఉద్యమకారులు కోరారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో సామాజిక న్యాయవేదిక సమన్వయ కర్తలు కల్లెపెల్లి రాజేందర్, గోపాల భూషన్‌రావు ఆధ్వర్యంలో ఉద్యమకారుల ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ప్రభుత్వం ప్రజల అవసరాలను తీరుస్తూ జనరంజకంగా పాలన కొనసాగిస్తే హర్షం వ్యక్తం చేస్తామన్నారు. కార్యక్రమంలో జక్కనపల్లి గణేశ్, వాసాల శ్రీనివాస్, ఉండాటి సతీష్, గాలిపల్లి కొండపోచయ్య, బొడ్డు నాగరాజు, సయ్యద్ షఫి హుస్సేన్, సయ్యద్ ఖాజా మోయినుద్దీన్, కందికొండ మొగిలి, కల్లెపల్లి అజయ్, మూడపల్లి శ్రీనివాస్, జక్కనపల్లి అంజయ్య, సిరిసిల్ల రాజేశం, కల్లెపల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం'

సుభాష్‌నగర్, మార్చి 11: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేది కాంగ్రెస్ అభ్యర్థేనని డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి జోష్యం చెప్పారు. సోమవారం నగరంలోని ప్రెస్ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్ పార్టీ వెంటే ఉన్నారని అన్నారు. సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడడం సరికాదన్నారు.

ఇప్పటి వరకు పది మంది కార్పొరేటర్లు జైలుకు వెళ్లారని వారిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి అన్నారు. కబ్జాదారులు ఎవరినీ చట్టం వదిలిపెట్టదన్నారు. అక్రమాలకు పాల్పడిన తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోకుండా ఆయనను బదిలీ చేశారని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తరువాత అతనిపై చర్యలు తీసుకుందన్నారు.

భూకబ్జా కేసులో ఇద్దరి అరెస్ట్

కరీంనగర్ క్రైం, మార్చి 11: కొన్ని సంవత్సరాల కిందట పూర్వీకులు విక్రయించిన భూమికి తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి మరొకరికి విక్రయించిన కేసులో ఇద్దరు నిందితులను మూడో ఠాణా పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా వారిని 14 రోజుల రిమాండ్‌కు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారని మూడో ఠాణా సీఐ తెలిపారు. సీఐ వై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం సుమారు 100 ఏళ్ళ కిందట కరీంనగర్ కిసాన్‌నగర్‌లోని సర్వే నెంబర్ 89/బిలో 30 గుంటల భూమిని తమ పూర్వీకులు జనగామ నర్సింగారావు, తిరుమల రావులు నుంచు దుర్గయ్యకు విక్రయించగా అతని ద్వారా 1970 సంవత్సరంలో విలాసాగరం మల్లయ్య కొనుగోలు చేశాడు. అతని మరణానంతరం అతని భార్య విలాసాగరం ఓదమ్మ ఆ భూమికి పట్టదార్ పాస్ బుక్ పొందింది. పహణీలలో కూడా పేరు సంవత్సరముల పాటు వచ్చింది. విలాసాగరం ఓదమ్మ ఆ భూమిని 8 ప్లాట్‌లుగా చేసి విక్రయించగా కొనుగోలు చేసినవారు వారి ప్లాట్‌ల చుట్టూ బేస్‌మెంట్లు నిర్మించుకున్నారు. కానీ కేవలం పాస్ బుక్‌పై ఖాతా నెంబర్ నమోదు కాలేదని రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న విషయం తెలుసుకున్న వన్నారంకు చెందిన బాసబోయిన శ్రీనివాస్ భూమి మొదటి యజమానుల మనుమలు జనగామ కిషన్‌రావు, జనగామ లక్ష్మణరావులతో కుమ్మక్కు అయి, తిరిగి ఆ భూమిని కాజే యాలన్న దురుద్దేశ్యముతో పథకం రచించాడు. ముగ్గురు కలిసి రెవెన్యూ అధికారులు జారీ చేసినట్లు తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించారు. ఓదమ్మ పాస్ బుక్‌ను రద్దు చేయించి, ఒక ప్లాట్‌ను సేల్ డీడ్ చేశారు. దీనిని గమనించిన ఇరుకుల్ల శిరీష అనే బాధితురాలు కోర్టు ద్వారా ఉత్తర్వులు తెచ్చుకుంది. తదుపరి రిజిస్ట్రేషన్‌లు జరుగకుండా ఆ భూమిని ప్రొహిబిషన్ జాబితాలో పెట్టించింది.

పలు తప్పుడు డాక్యుమెంట్లు పెట్టి, సబ్‌రిజిస్ట్రార్‌తో కుమ్మక్కు అయి 22గుంటల భూమిని కొక్కుల వెంకటేశ్వర్‌రావు అనే వ్యక్తికి విక్రయించారు. వెంకటేశ్వర్‌రావు బలవంతంగా భూమిలోకి వెళ్లి రౌడీలతో బెదిరించి, వాళ్ళ భూమి లాక్కుని షెడ్లు, బోర్లు వేసి ఆక్రమించాడు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నిందితులు జనగామ కిషన్‌రావు, జనగామ లక్ష్మణరావును రిమాండ్‌కు పంపించామని, మిగతా నేరస్తులు, వారికి సహకరించిన వారు పరారీలో ఉన్నారని సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

టీఎన్‌జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడిగా జగదీశ్వర్ ఎన్నిక


మారం జగదీశ్వర్‌ను సన్మానిస్తున్న నాయకులు

సుభాష్‌నగర్,మార్చి11: టీఎన్‌జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షు డిగా మారం జగదీశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా టీఎన్‌జీవో అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మారం జగదీశ్వర్‌ను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారం జగదీశ్వర్ తాలుకా స్థాయి నుంచి జిల్లా కార్య దర్శిగా, జిల్లా అధ్యక్షునిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నేడు కేంద్ర సంఘం అధ్యక్షుడిగా అంచెలంచెలుగా ఎదిగారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణ రావు, కేంద్ర సంఘం నాయకుడు నాగుల నర్సింహస్వామి, ఉపాధ్యాయుల చంద్రశేఖర్, హరికృష్ణ, కోశాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మిందర్‌సింగ్, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్‌భరద్వాజ్, నేరెళ్ళ కిషన్,గూడ ప్రభాకర్, వెలిచాల సుమంత్‌రావు, మల్కా రాజేశ్వర్‌రావు, అరసవెల్లి రాజేశ్వర్‌రావు, రాజామనోహర్, జగన్, భగవాన్‌రెడ్డి, రాజేంద్ర ప్రసాద్, అభిషేక్‌రెడ్డి, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ బలగాల ఫ్లాగ్‌మార్చ్

కరీంనగర్ క్రైం, మార్చి 11 : కరీంనగర్ ఒకటో ఠాణా పరిధిలో పలు సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాల్లో సోమవారం సీఐఎస్ఎఫ్ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. బైపాస్‌రోడ్ నుంచి ప్రారంభమైన ఫ్లాగ్‌మార్చ్ కోతిరాంపూర్, మైసూర్ బేకరి, గణేష్‌నగర్, అంబేద్కర్‌స్టేడియం, భగత్‌నగర్, పెద్దమతల్లిగుడి వద్ద ముగిసింది. సీఐఎస్ఎఫ్ బలగాల సేవలను వినియోగించుకుంటామని సీపీ అభిషేక్ మొహంతి తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ ఏసీపీ జి నరేందర్, కంపెనీ కమాండెంట్ విక్రాంత్, అసిస్టెంట్ కమాండెంట్ విజేందర్, సీఐలు సరిలాల్, రమేష్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

● ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


శంకరపట్నంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

శంకరపట్నం, మార్చి 11: మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించి అన్ని రంగాల్లో ముందుండాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం శంకరపట్నంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా సాంస్కృతిక సంస్థల కళాకారుల సమైఖ్య 36వ వార్షికోత్సవం సందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళా కళాకారుల సమ్మేళన కార్యక్రమం సమైఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు వైఎస్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడారు. అనంతరం అలిశెట్టి ప్రభాకర్ సిటీ లైఫ్ ఆంగ్లానువాదం 'ఏ ప్రోగ్రెస్సివ్ రెండరింగ్' కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. ఆంగ్లానువాదం చేసిన కొత్తకొండ మనోజ్‌కుమార్‌ను ఆయన అభినందించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత, ప్రముఖ కవి వారాల ఆనంద్ మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న దోపిడీ, అణచివేతలపై తన కవితా స్వరాన్ని వినిపించిన కవి అలిశెట్టి అన్నారు. వివిధ రంగాల్లో రాణించిన మహిళలను సన్మానించారు. కవ్వంపల్లి అనురాధ ఆధ్వర్యంలో మహిళ డప్పు కళాకారులకు షూ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాకారుల సమైఖ్య మండలాధ్యక్షుడు పడాల సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బోళ్ల కొంరయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

మానకొండూర్: సహకార సంఘాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. మండలంలోని దేవంపల్లి సహకార సంఘంలో నూతన గోదాంల నిర్మాణానికి సోమవారం ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. గోదాంతో పాటు సమావేశ మందిరానికి రూ. 18లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు కసిరెడ్డి లత, ఉపాధ్యక్షులు పాఖాల రాజేందర్‌రెడ్డి, కార్యదర్శి మల్లిఖార్జునరెడ్డి, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

● మానకొండూర్: మండలంలోని పోచంపల్లి గ్రామంలో గల ఆదర్శ పాఠశాలను సోమవారం స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులలో చెత్తాచెదారం ఉండడంతో ప్రిన్సిపాల్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో రెండు రోజులలో బోరు వేయించి మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. మండల అధ్యక్షులు నందగిరి రవీంద్రాచారి, ఎంపీటిసి రామాజంనేయులు, ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

● మానకొండూర్ : పురుషులతో మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే మహిళా సాధికారిత సాధించినట్లు అవుతుందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎంపీపీ ముద్దసాని సులోచన ఆధ్వర్యంలో ఎంపీపీ కార్యాలయంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎంపీపీ ముద్దసాని సులోచన, డాక్టర్ కవ్వంపల్లి అనురాధతో పాటు మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.

● మానకొండూర్ : ప్రధాన మంత్రి నరేంద్రమోదీది తుగ్లక్ పాలన అని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం మానకొండూర్‌లో మండల కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రాకుండా ప్రజలు తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంకుశ, నియంతృత్వ పాలన కొనసాగించిందన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్ కారు : తప్పిన ప్రమాదం

శంకరపట్నం, మార్చి 11: శంకరపట్నం మండలం కొత్తగట్టు సమీపంలో హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య కారు సోమవారం అదుపు తప్పి పొలాల్లోకి వెళ్లింది. కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు వెళ్తుండగా ఘటన జరిగింది. కమిషనర్‌కు స్వల్ప గాయాలు కాగా హుజూరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

సైదాపూర్, మార్చి 11: ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రజలకు పచ్చదనం పరిశుభ్రత, మానవ సంబంధాల అభివృద్ధిపై అవగాహన కల్పించాలని ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని లస్మన్నపల్లిలో సింగాపూర్‌లోని వీఎస్సార్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ వేసవికాల ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని రక్షించేది సమాజాన్ని చైతన్యవంతులను చేసే బాధ్యత ఎన్ఎస్ఎస్ వలంటీర్లపైన ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీవీఎస్ హనుమకుమార్, స్పెషలాఫీసర్ గిరీష్, పంచాయతీ సెక్రటరీ గాజుల శ్రీలక్ష్మి, మాజీ సర్పంచ్ కాయిత రాములు పాల్గొన్నారు.

వైభవంగా గిరిజా మృత్యుంజయ మహాదేవుల కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తిమ్మాపూర్, మార్చి11: మండలంలోని మహాత్మానగర్ ఎల్ఎండీ కాలనీలో గల శ్రీ గిరిజా మృత్యుంజయ మహా దేవాలయములో సోమవారం శ్రీ గిరిజా మృత్యుంజయ మహాదేవుల కల్యాణం వైభవంగా జరిగింది. వేదమూర్తులు పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక వేంకటేశ్వర ఆలయం తరపున ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చల్ల మోహన్‌రెడ్డి, ఇరిగేషన్ శాఖ ఈఎన్సీ శంకర్, ఎస్ఈ శివకుమార్, ఆలయ కోశాధికారి గజవెల్లి బాలకిషన్‌రావు, సహాయ కోశాధికారి బట్టు కరుణాకర్, ఎంపీపీ కేతిరెడ్డి వనిత, ఆలయ అర్చకులు శ్రీకాంత శర్మ, నాయకులు వొంటెల రవీందర్ రెడ్డి, కిషన్, రమేష్, అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, మార్చి 11: కరీంనగర్ ముకరంపురలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిస్సా నాష్ట్రం బళేశ్వర్ ప్రాంతానికి చెందిన హోటల్ కార్మికుడు నిషైన్ చరణ్‌గిరి (47) దుర్మరణం చెందాడని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. ఒడిస్సాకు చెందిన చరణ్‌గిరి రెండు ఏళ్ళుగా మైత్రీ హోటల్‌లో కిచెన్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. హోటల్‌లో పనిచేసే కార్మికులు ముకరంపుర మహారాజా స్వీట్ హౌజ్ వెనుక వైపున ఉన్న ఒక అద్దెగదిలో ఉంటూ హోటల్‌కు వెళుతూ ఉంటారు. ఇదే క్రమంలో సోమవారం ఉదయం చరణ్‌గిరితో పాటు మరో ఇద్దరు కలిసి హోటల్ విధులకు వెళుతుండగా రోడ్డుదాటుతున్న సమయంలో ఒక వ్యక్తి బైక్‌ను అతివేగంగా నడుపుతూ వచ్చి చరణ్‌గిరిని ఢీకొట్టాడు. దీంతో చరణ్‌గిరి రోడ్డుపై పడిపోగా అతని తలకు తీవ్రగాయాలయ్యాయి. 108లో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. మృతుడి బంధువు ఇచ్చిన ఫిర్యాదుతో బైక్ నడుపుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

● సంక్షిప్త సమాచారం..

●కరీంనగర్ అర్బన్: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 54వ డివిజన్‌లో డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండి తాజ్, నాయకులు కొరివి అరుణ్‌కుమార్, సయ్యద్ అఖిల్, అబ్దుల్ రహమాన్, డివిజన్ అధ్యక్షుడు ఎండి ఖలిమొద్దిన్, సాజిద్, అబ్దుల్ కరీం, నిహాల్ అహ్మద్, అక్బర్, జీడి రమేష్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, నాగ ప్రసాద్, మాసుమ్ ఖాన్, నెల్లి నరేష్, జిలకర రమేష్, కీర్తి కుమార్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

●కరీంనగర్ అర్బన్: కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులుగా మహమ్మద్ రజుఉద్దీన్‌ను నియామకం చేశామని మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ తాజొద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరశాఖ అధ్యక్షులు సయ్యద్ అఖిల్‌లు రజుఉద్దీన్‌కు 54వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.

●కరీంనగర్ అర్బన్: కొత్తపల్లి మండలం కమాన్పూర్ గ్రామంలోని సర్వే నెంబరు 116లో ఇందిరమ్మ ఇళ్లకు కేటాయించగా మిగులు భూమిని కొందరు కాజేశారని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్‌పార్టీ అసెంబ్లీ అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

●కరీంనగర్ క్రైం: కరీంనగర్ ఒకటో ఠాణా ఎదుట ఒక రెగ్జిన్ షాపులో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రెగ్జిన్‌షాపులో వెల్డింగ్ పనులు చేస్తున్న సమయంలో మంటలు అంటుకుని షాపులో 30 వేల వరకు ఆస్థికి నష్టం వాటిల్లిందని తెలిపారు. ప్రమాదం విషయం తెలుసుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది ఫైర్ ఇంజన్‌తోసహా సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పివేశారు.

●కరీంనగర్‌రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహించే మహిళలకు సోమవారం కరీంనగర్ రూరల్ తహసీల్దార్ నవీన్‌కుమార్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు వాస్తవిక్, రజనీకాంత్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●సైదాపూర్:ఎక్లాస్‌పూర్, ఆరెపల్లి, గర్రెపల్లి గ్రామాల్లోని రైతులకు డబ్ల్యూడబ్ల్యూఎఫ్ నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ వారి బీసీఐ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పురుగుల మందుల వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

● హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు పరిశుభ్రతను పాటించాలని డాక్టర్ కీర్తన అన్నారు. సోమవారం మండలంలోని చెల్పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీసీఈసీ ప్రోగ్రాంలో భాగంగా 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు.

● హుజూరాబాద్: జరగబోయే పార్లమెంట్ ఎన్నికలను బ్యాలెట్ పేపర్ పద్ధతిన జరపాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సొల్లు బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చాలా దేశాల్లో బ్యాలెట్ పద్ధతిన ఎన్నికలు జరుగుతున్నాయన్నారు.

● ఇల్లందకుంట: తెలంగాణ సమాజాన్ని మాజీ సీఎం కేసీఆర్ అవమానపరిచారని కాంగ్రెస్ నాయకుడు అన్నం ప్రవీణ్ అన్నారు. యాదాద్రిలో సోమవారం జరిగిన యాదృచ్ఛిక సంఘటనను భూతద్దంలో చూస్తూ తెలంగాణ సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు.

●చొప్పదండి: పట్టణంలోని 12వ వార్డుకు చెందిన నిరుపేద బత్తిని శ్రీనివాస్ ఇటీవల మరణించాడు. సోమవారం మాజీ మార్కెట్ చైర్మెన్ ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్ ఆయన కుటుంబానికి రూ.5000, బత్తిని సంపత్‌గౌడ్ రూ.2000ల ఆర్థిక సహాయన్ని అందించారు.

● చొప్పదండి : చొప్పదండి శివకేశవ ఆలయానికి చెందిన అర్చకులు సోమవారం ఆలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అర్చకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్చకులు జనగామ సత్యనారాయణ, సింహాచలం ప్రభాకరచార్యులు ఉన్నారు.

●హుజూరాబాద్‌రూరల్: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జి అన్నారు. సోమవారం మండలంలోని పెద్దపాపయ్యపల్లిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. టౌన్ సీఐ రమేష్, సీఐఎస్ఎఫ్ ఆఫీసర్స్, జవాన్లు ఉన్నారు.

● గన్నేరువరం: మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనుట్లు ఎంపిడీవో శంకర్ తెలిపారు.

● జమ్మికుంట రూరల్: వారణాసి (కాశి)కి వెళ్లే దానాపూర్ ట్రైన్ ఇకపై ప్రతిరోజు జమ్మికుంటలో హాల్టింగ్ ఉంటుందని బీజేపీ సీనియర్ నాయకుడు ఆకుల రాజేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

● రామడుగు: రెండో విడుత రామడుగు మండలానికి గొర్రెలను పంపిణీ చేయాలని జిల్లా కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి కడారి అయిలయ్య ప్రజావాణిలో సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

● రామడుగు : 45వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలలో మండలంలోని వెలిచాల సరస్వతీ హైస్కూల్ విద్యార్థి దైవాల ప్రణీష్ సత్తాచాటాడు. వరంగల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 8 నుంచి 10 వరకు జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో ప్రణీష్ రెండవ స్థానంలో నిలిచినట్లు కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థి, కోచ్ సాయికృష్ణను అభినందించారు.

● ఇల్లందకుంట: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కరీంనగర్‌లో మంగళవారం నిర్వహించే కదనభేరి సభకు మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎంపీపీ సరిగోమ్ముల పావని- వెంకటేష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

● హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తుమ్మనపల్లి పీఏసీఎస్ చైర్మన్ కౌరు సుగుణాకర్‌రెడ్డి పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్ష కిట్లను పంపిణీ చేశారు.

● మానకొండూర్ : ఎన్ఎస్ఎస్ వలంటర్ల సేవలు అభినందనీయమని శాతవాహన యూనివర్సిటీ కో-ఆర్డినేటర్ డాక్టర్ మనోహర్ అన్నారు. మండలంలోని అన్నారం, రంగపేట గ్రామాలలో కరీంనగర్ వాగేశ్వరీ డిగ్రీ పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో మాట్లాడారు.

● మానకొండూర్: ఎస్ఐ సంజీవ్ 22 వర్ధంతి వేడుకలు మానకొండూర్‌లో సోమవారం జరిగాయి. చెరువుకట్ట బస్టాండ్ వద్ద ఎస్ఐ సంజీవ్ విగ్రహానికి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.